పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు

- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు
- 'ఉత్తర'లో 27 కేంద్రాల ఏర్పాటు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు



మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో పోలీసులు



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్

సీతంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉత్తర నియోజకవర్గంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది పట్టభద్రులు ఉన్నట్టు సమాచారం. సోమవారం జరగనున్న ఎన్నికకు సంబంధించి నక్కవానిపాలెం, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, మాధవధార, మర్రిపాలెం, రైల్వే న్యూకాలనీ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి 235, 235ఏ, 236, 236ఏ, 237, 237ఏ 238, 239, 240, 241, 258, 259, 260, 261, 262, 263, 264, 265, 266, 266ఏ 267, 267ఏ, 268, 269, 270, 271, 272 వరకు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో మరికొన్ని కేంద్రాలను కేటాయించారు.

మాధవధార హైస్కూల్‌లో 4 కేంద్రాలు

మురళీనగర్: మురళీనగర్, మాధవధార ప్రాంతాలకు సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. 267, 267ఎ బూత్‌లకు మొత్తంగా 1,355 మంది, 268కి 1,256 మంది, 269కి 1,141 మంది పట్టభద్ర ఓటర్లను కేటాయించారు. ఈ పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో 3,752 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకుని ఓటింగ్‌కు సంబంధించి పోలీసు బందోబస్తుతో సహా అన్నీ సిద్ధం చేశారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు..

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 235, 235ఏ 236, 236ఏ 237, 237ఏ నంబర్లు గల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో 238, 239.. నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో 240, 241.. రైల్వే న్యూకాలనీ కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్‌లో 258, 259, 260, 261.. రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్ 262.. కైలాసపురం డీఎల్‌బీ కల్యాణ మండపంలో 263, 264.. కంచరపాలెం ఆర్పీ పేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో 265, 266, 266ఏ.. మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో 267, 267ఏ, 268, 269.. మర్రిపాలెం కేంద్రీయ విద్యాలయం–2లోని 270, 271, 272 నంబర్ల పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం.. తండ్రి ఆశయాలు కొనసాగించాలనే సదుద్దేశంతో తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించారన్నారు. 2014 ఎన్నికల్లో 67 స్థానాల్లో గెలుపొంది బలమైన ప్రతిపక్ష నేతగా జగన్ అసెంబ్లీలో ప్రజల సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకుని అత్యధిక మెజారిటీతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదేన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులందరికీ సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు విశాఖలో సమ్మిట్ నిర్వహించారన్నారు. అత్యధిక ప్రజాదరణ పొందిన నేతగా సీఎం వైఎస్ జగన్ ఎదిగారన్నారు. ఇది చూసి ఓర్వ లేకే ప్రతిపక్ష నాయకులు ఆయనపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, చల్లా రజని, సీనియర్ నాయకుడు ఐహెచ్ ఫారూఖీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, ఎయిర్‌పోర్ట్ అడ్వయిజర్ శైలేష్, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాస్, నూకరాజు, కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, రత్నాకర్, సీనియర్ నాయకుడు పోతు సత్యనారాయణ, మహిళా అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం డ్రా తీశారు. 159 మంది రైతులకు సంబంధించిన 63 స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో వ్యాపారాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతు వ్యాపారులు పాల్గొన్నారు.

డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలి



నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న ఏడీ యాసిన్

సీతంపేట: డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలని, సహాయకులుగా మహిళలనే నియమించుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్ అన్నారు. ఆదివారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బజారులోని స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఎవరికి కేటాయించిన స్టాల్‌లో వారే విక్రయిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ధరల పట్టిక ప్రకారం విక్రయాలు జరిగేలా చూడాలని సిబ్బందిని యాసిన్ ఆదేశించారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన సభ్యుల ఎంపిక



అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న వివిధ కార్యవర్గ సభ్యుల ఎంపికలు ఇటీవల చేపట్టినట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా స్టాక్ వెరిఫైయర్ జి.ఉమామహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా మెరైన్ ఇంజినీర్ పి.ప్రసన్నకుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.ఎస్.దీప్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సభ్యుల ఎన్నికకు సహకరించిన వారికి, నూతన సభ్యులకు ఎన్నికల కన్వీనర్ సింగ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: యువ గళాల నుంచి జాలువారిన రసరమ్య సినీ గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆదివారం రాగమయి సాంస్కృతిక సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరి మైమరిపించింది. యువ గాయకుడు గంటి అభినయ స్వరానికి అనుగుణంగా గాయనీమణులు సత్యశ్రీ, నిషిత, లయ, జోషిత, సాత్విక, కందర్పరాధ, జ్యోతి, జగదాంబ తదితరులు శ్రావ్యంగా ఆలపించిన గీతాలు అకట్టుకున్నాయి. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంగీత విభావరికి మెలోడి క్రియేటర్స్ సీహెచ్ సత్యనారాయణ బృందం, గాయకుడు ఎం. త్రినాథ్ తదితరులు సహకరించగా, కార్యక్రమానికి వ్యాఖ్యాతగా రాధారాణి వ్యవహరించారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి
- రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇస్కిమిక్ హార్ట్ డిసీజస్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. వీరిలో అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

'బుల్లయ్య' విద్యార్థుల బీచ్ క్లీన్



బీచ్ క్లీన్‌లో పాల్గొన్న బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థులు

దాబాగార్డెన్స్: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీన్ కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఉమా దయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉమాశంకర్, చిరివేళ్ల సాయి మహంతీర్, స్వచ్ఛంద సేవకుడు భార్గవ్ వంశీ, బొండా ప్రియాంక, ద్వారపురెడ్డి పావని, ప్రసన్న, పూజిత, మెట్ల నాగరాజు, కె. బారన్, వీరబాబు, రవి, అనంత్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు బాబు ఏం చేశారు..?

- ఎమ్మెల్యే గంటాపై మండిపడ్డ కె.కె.రాజు



మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: టీడీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీరుపై వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మండిపడ్డారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ×సాక్షి×తో ఆయన మాట్లాడుతూ గంటా నీతులు మాట్లాడటం.. దెయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. ×మీ వియ్యంకుడు నారాయణ అవినీతిపై మాట్లాడే ధైర్యం ఉందా.. ఉత్తరాంధ్రకు మీ పార్టీ అధినేత చంద్రబాబు చేసిన అన్యాయంపై మాట్లాడగలరా× అని గంటాను ప్రశ్నించారు. నాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో.. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతోందన్నారు. స్వార్థ రాజకీయాలే గంటాకు ముఖ్యమని, ఉత్తర నియోజకవర్గంలో గెలిచిన తరువాత ఎన్ని సార్లు పర్యటించారో చెప్పాలన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు గంటా గురించి చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకోవాలని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఉత్తరాంధ్రకు చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, రాష్ట్రంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని కె.కె.రాజు పేర్కొన్నారు.

కళాకారుల క్రికెట్ విజేత డాల్ఫిన్ డాన్



విజేతగా నిలిచిన డాల్ఫిన్ డాన్ జట్టు

దాబాగార్డెన్స్: కళాకారుల క్రికెట్ టోర్నమెంట్‌లో డాల్ఫిన్ డాన్ విజయం సాధించింది. రెడ్ హిల్స్ రైడర్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. గత మూడు రోజులుగా సాగిన కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. వైజాగ్ ఆర్టిస్ట్స్ క్రికెట్, సత్‌గీత్ క్రియేషన్స్, శ్రీవిష్ణు స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞానాపురం సోఫియా జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో పోటీలు జరిగాయి. ఫైనల్ పోటీలో ఇరుజట్లు పోటాపోటీగా తలపడ్డాయి. 6 వికెట్ల తేడాతో రెడ్ హిల్స్ రైడర్స్ జట్టుపై డాల్ఫిన్ డాన్ గెలుపొందింది. మహిళల విభాగంలో నైటింగేల్ టీంపై మదర్ థెరిసా జట్టు గెలుపొందింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు గణేష్ రథో మాట్లాడుతూ ప్రజలకు తమ కళ ద్వారా వినోదాన్ని పంచే కళాకారులకు క్రికెట్ టోర్నమెంట్ ఒక ఆటవిడుపులా మారిందన్నారు. ప్రొఫెషనల్ క్రీడాకారులు మాదిరిగానే కళాకారులు కూడా విజయం కోసం పోరాడడం గొప్ప విషయమన్నారు. క్రీడల్లో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా క్రీడా స్ఫూర్తి అన్నది మనిషి జీవితానికి ఒక టానిక్‌లా పని చేస్తుందన్నారు. రెడ్డెం యాదకుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కళాకారుల క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సినీ, బుల్లి తెర, రంగస్థల కళాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా మరింత ఉత్సాహభరిత వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎస్. ఫణిస్వామి, భూమాత ఈడీ కిరణ్, సంగీత కళాకారుల అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, విశాఖ కళాకారుల సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్దన్, రాపేటి అప్పారావు, మోహన్, వినోదిని, ప్రకాష్, నటులు నాంచారయ్య, టి. ధనుంజయ, శివజ్యోతి, హేమ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరకుల పంపిణీ

కంచరపాలెం: ఆపన్నుల ఆకలి తీరిస్తే అంతకు మించిన తృప్తి ఉండదని స్వామి వివేకానంద మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాసరి బుజ్జి అన్నారు. జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరకులు అందజేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ ఆదినారాయణ, వాసు, రవి విఠల్, కొల్లా జగదీశ్వరరావు, రాపాక యాదవ్, ఎల్లాజీరావు పాల్గొన్నారు.

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ బజార్ పేరుతో చేనేత హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్కోల్ అండ్ మార్బుల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఈత పోటీలు



ఈత పోటీలను ప్రారంభిస్తున్న సనపల వరప్రసాద్, పాల్గొన్న బాలలు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ఈత పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు పోటీపడ్డారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు, డెకథ్లాన్ స్పోర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 106 మంది పాల్గొనగా.. వీరిలో 62 మంది చిన్నారులు ఉన్నారు. వయసుల వారీగా పోటీలు జరిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సనపల వరప్రసాద్, భారత వాయు సేన రిటైర్డ్ వారంట్ ఆఫీసర్ వాకర్ సోమనాథ్ సాహూ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్క్ కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు బోయపాటి శ్రీనివాస్, శాంత భూషణ్, కోశాధికారి కె.కుర్మారావు, కె.సురేష్, సంయుక్త కార్యదర్శి బి.త్రినాథస్వామి, కార్యవర్గ సభ్యులు మళ్ల రామకృష్ణ, పల్లా చంద్రమౌళి, కనకరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

- ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- నేషనల్ గ్రూప్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కీటకాహార మొక్కలు



కీటకాలను ఆహారంగా తీసుకునే మొక్క

ఏయూ క్యాంపస్: కీటకాహార మొక్క పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో కనువిందు చేస్తోంది. ఒక మొక్క పదికిపైగా ప్రత్యేకమైన సంచులతో వృక్షశాస్త్ర పరిశోధకులు, విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ట్రయాంగులరిస్‌గా వ్యవహరించే ఈ చెట్టు ఆకు మధ్య ఈనె ఒక తిత్తిగా మారిపోతుంది. తిత్తె చుట్టూ మకరందం వంటిది ఏర్పడుతుంది. ఇది కీటకాలను ఆకర్షిస్తుంది. అందమైన రంగులతో కనిపించే ఈ తిత్తెను చూసి కీటకాలు దీనికి ఆకర్షితమవుతాయి. దీనిని తాకిన వెంటనే కీటకాలు ఆ తిత్తె వంటి సంచిలోకి జారిపోతాయి. వీటిని ఆహారంగా మార్చుకుని జీర్ణచేసుకునే లక్షణం కలిగి ఉండటం దీని ప్రత్యేకత. కీటకాలను ఆరగించి, జీర్ణం చేసుకుంటుంది. ఈ మొక్కలను ప్రత్యేక పరిస్థితుల్లో పెంచుతారు. వీటికి నేరుగా ఎండ తలగకూడదు. నీడనిచ్చే ప్రాంతాలలో కుండీలలో వీటిని పెంచుతారు. దీనికి ప్రత్యేకంగా ఆర్‌ఓ వాటర్, సహజ సిద్ధమైన వర్షపు నీటిని మాత్రమే వినియోగించాలి. మేఘాలయలో దట్టమైన అటవీ ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయని జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. నెపెంథిస్ జాతికి చెందిన మొక్కలుగా వీటిని వ్యవహరిస్తారు.

పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎస్‌కే మహంతి, అనూష పట్నాయిక్

బీచ్ రోడ్డు: సినీ సంగీత దర్శకుడు కేవీ మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మా, సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె. మహంతి తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్‌తో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మహంతి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కళా రంగానికి తన గాన మాధుర్యంతో అలరిస్తున్న జామి శివ అప్పలరాజుకు స్వర కళా పురస్కారం అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. 14న సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ మహదేవన్ స్వరపరచిన చిత్ర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారుల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



సాగర తీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐ ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.